క్లుప్తంగా

మరింత బాధ్యతగా సేవలందించాలి



జీ.ఎర్రగుడిలో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

తుగ్గలి: గ్రామ వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. శనివారం జీ.ఎర్రగుడిలో సేవా వజ్రకు ఎంపికైన వలంటీర్ జిట్టా చిన్న కదిరప్ప, తుగ్గలిలో సేవారత్నకు ఎంపికై న సిరిసెట్టి అశోక్‌తో పాటు, గిరిగెట్లలో వలంటీర్లను సన్మానించి పురస్కారాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, రాజునాయక్, గోపాల్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జిట్టా నాగేష్ యాదవ్, నాయకులు హనుమంతు, మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు లడ్డు కమాల్ బాషా, జిట్టా వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా విత్తన రిజిస్ట్రేషన్లు

తుగ్గలి: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ నేపథ్యంలో ఆర్బీకేలు వేదికగా రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. శనివారం నాటికి 1,795 క్వింటాళ్ల విత్తన కాయల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. రాతనకు వచ్చిన ఒక లారీలోడు వేరు శనగకాయలను రైతులకు పంపిణీ చేశామన్నారు. సోమవారం నుంచి అన్ని ఆర్బీకేల ద్వారా రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): గోనెగండ్ల మండలం బి.అగ్రహారంలో శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ శనివారం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును కలసి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతమున్న శ్మశాన వాటికను ఓ వ్యక్తి ఆక్రమించుకోవడంతో పాటు రస్తా పేరుతో కోర్టుకు వెళ్లడంతో ఎవరైనా చనిపోతే పూడ్చటానికి స్థలం లేకుండాపోయిందని గౌస్‌దేశాయ్ వివరించారు. విచారించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

తండాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తుగ్గలి: మండల పరిధిలోని సూర్య తండా, బాటతండాలలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పగిడిరాయి పీహెచ్‌సీ వైద్యాధికారి మినాజ్‌పాషా ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరి సరాల శుభ్రతపై వైద్యాధికారి అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫీ'జులుం' నియంత్రించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, ఉదయ్‌కుమార్, శేఖర్, సురేష్, షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశారు. శనివారం పీడీఎస్‌యూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సంఘం, పీఎస్‌యూ, ఆర్‌పీఎఫ్‌యూ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ గురురాజారావుకు ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఆకస్మిక మృతి



గుడిపాటి గోపాల్ (ఫైల్)

వెల్దుర్తి: గ్రామానికి మంచి చేస్తూ, ప్రజా సేవలో మంచి పేరు సంపాదించుకున్న గోవర్ధనగిరి గ్రామ వైఎస్సార్సీపీ నాయకుడు గుడిపాటి గోపాల్ శుక్రవారం రాత్రి ఇంటి మిద్దెపై నిద్రలోనే తుది శ్వాస విడిచాడు. శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్ర లేపేందుకు ప్రయత్నించగా విగతజీవిగా కనిపించాడు. గోపాల్ కొద్దిరోజులుగా షుగర్, ఇతర అరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆయన మృతితో కుటుంబసభ్యులతోపాటు, గ్రామం శోకసంద్రమైంది. పత్తికొండలో సీఎం పర్యటన ఏర్పాట్లలో ఉన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి విషయం తెలుసుకుని హుటాహుటిన గోవర్ధనగిరికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంచి నాయకుడిని కోల్పోయామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నాయకులు కంగాటి రామ్మోహన్‌రెడ్డి, సమీర్‌కుమార్ రెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి తదితరులు నివాళులర్పించారు. మృతుడు గోపాల్‌కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయంత్రం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఐస్ ఆపిల్ అదరహో !



గోనెగండ్లలో తాటిముంజలు విక్రయిస్తున్న వ్యాపారులు

గోనెగండ్ల: ఒక పక్క మండు వేసవి రోజు రోజుకు తాండవిస్తోంది. మరోవైపు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజూ 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. చల్లదనం ఎక్కడ దొరుకుందా అంటూ పరిగెత్తేలా చేస్తున్నాయి. ఇలా కూల్ కోసం వెంపర్లాడుతున్న వారిని ఎంతగానో ఆకర్షిస్తున్నాయి చల్లచల్లటి తాటి ముంజలు. వీటిని తినగానే చల్లదనమిస్తూ ఉపశమనం కలిగిస్తున్నాయి. వేసవిలో దొరికే ఈ ఐస్ ఆపిల్ మంచి చలువతో పాటు పోషకాలు అందిస్తుండడంతో వాటిని ఆరగించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మండు వేసవి నుంచి కాస్త ఉపశమనానికి ఈ కాలంలో గుర్తుకొచ్చేవి తాటి ముంజలే. రంగు, రుచి, ఆకారం చూసి ఆంగ్లేయులు దీనికి ఐస్ యాపిల్ అని నామకరణం చేశారట. వేసవిలో ముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రధాన రహదారి, కూడళ్లలో పలు ప్రాంతాల నుంచి తాటి ముంజలను తెచ్చి విక్రయిస్తున్నారు. డజన్ తాటి ముంజలు రూ.50 ప్రకారం అమ్ముతున్నారు.

పోషకాల పెట్టె తాటి ముంజ

తాటి ముంజల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. 100 గ్రాముల తాటిముంజల్లో 43 కేలరీల శక్తి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇందులో విటమిన్-ఏ సమృద్ధిగా లభిస్తుంది. అలాగే బి, సి విటమిన్లు ఉంటాయి. ఇందులో పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. శరీరంలోని విషతుల్యాలను బయటకి పంపుతుంది. ఐరన్, కాల్షియం వంటి ఖనిజ లవణాలు ఇందులో ఉన్నాయి. ముంజల్లో అధిక శాతం నీరు ఉండడం వల్ల డీహైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. శరీర బరువు తగ్గించుకోవచ్చు. వేసవిలో ముంజలను తినడం ద్వారా శరీరంలోని ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చు. తాటి ముంజుల పొట్టులో అధిక పోషకాలుంటాయంటారు. వీటితో కాలేయ సంబంధ వ్యాధులు తగ్గించుకోవచ్చునని, అలాగే గర్భిణులు తింటే జీర్ణ వ్యవస్థ బాగా పనిచేయడంతో పాటు మలబద్ధకం, ఎసిడిటీ లాంటి ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

సీఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు



సభా ప్రాంగణ మైదానంలో మంత్రి, ఎమ్మెల్యేతో చర్చిస్తున్న ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం



హెలిప్యాడ్ వద్ద తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బంది



బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పత్తికొండ టౌన్: పత్తికొండలో ఈనెల 30వ తేదీన జరగనున్న సీఎం రైతు భరోసా సభకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎస్పీ జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి పత్తికొండలో పర్యటించి పనులను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం సెయింట్‌జోసెఫ్ ఉన్నత పాఠశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్ల పనులను పర్యవేక్షించి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఆర్డీఓ మోహన్‌దాసు, డీఎస్పీలు శ్రీనివాసులు, యుగంధర్‌బాబు, శివనారాయణ స్వామి, సీతారామయ్య ఉన్నారు.

సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు నాగరాజు, సల్మాన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సీఐటీ యూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాజాత జూన్ 1వ తేదీన ఎమ్మిగనూరుకు వస్తుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కథల పుస్తకాలతో సృజనాత్మకత

వెల్దుర్తి: మంచి కథల పుస్తకాలు చదవడం ద్వారా పిల్లలో సృజనాత్మక శక్తి పెరుగుతుందని స్థానిక గ్రంథాలయాధికారి కవితాబాయ్ అన్నారు. శనివారం గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరంలో చిన్నారులకు కథలు రాసే విధంగా ప్రోత్సహించారు. తద్వారా వారిలోని ఊహాశక్తి తెలుస్తుందన్నారు. చదువులో కూడా ముందంజలో ఉంటారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

మద్దికెర: మండలంలోని ఎడవలి గ్రామంలో గత రెండు రోజులుగా వ్యవసాయ విద్యుత్ సక్రమంగా సరఫరా చేయడం లేదని రైతులు శివ, బాలరంగస్వామి, వెంకటరాముడు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టి విద్యుత్ శాఖాధికారి వీరేష్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చిప్పగిరి: ఈ నెల 24 ప్రారంభమైన ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలు స్థానిక జూనియర్ కాలేజీలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం గణితం 1 బి, జువాలజీ 1 పరీక్షలు జరగగా 82 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం వంద శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. అవాంఛనీయ ఘటనలు, మాస్ కాపీయింగ్ జరగకుండా ఎస్‌ఐ మల్లికార్జున గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు ఈ నెల 31 వరకు జరగనున్నాయి.

బీజేపీ బలోపేతానికి కృషి

మద్దికెర: గ్రామీణ ప్రాంతాల్లో సైతం భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రపంచంలో భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పారన్నారు. బీజేపీ చేసిన అభివృద్ధిని గ్రామాలలో ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. సమావేశంలో రంగనాథ్, టైలర్ సూరి, సోమశేఖర్‌గౌడ్, మనోహర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

1న కూర్మనారాయణ స్వామి జయంతి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీ కూర్మనారాయణ స్వామి జయంతి ఉత్సవాలను జూన్ 1వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ క్షేత్ర ప్రచార సమన్వయకర్త నరేష్ తెలిపారు. శనివారం కూర్మనారాయణ స్వామి ఆలయం ఆవరణలో భక్తులు జయంతి కరపత్రాలను విడుదల చేశారు. ఆలయంలో జూన్ 1వ తేదీన క్షీర, చందన, పంచామృతాభిషేకం, శ్రీ లక్ష్మీ అష్టోత్తర సహిత, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, అవధూత హనుమప్ప పూజ, అతి పురాతనమైన రావిచెట్టు, శమీ వృక్ష పూజ, నాగదేవతల పుట్టలకు పూజలు, కలశ పూజ, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నరేష్ తెలిపారు. గ్రామ పెద్దలు పెద్ద హనుమంతు, వపన్ స్వామి, వెంకట్రాముడు పాల్గొన్నారు.

ఆర్బీకేలకు చేరుతున్న విత్తనాలు

కృష్ణగిరి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీపై అందించేందుకు వేరుశనగ విత్తనాలు ఆర్బీకేలకు చేరుతున్నట్లు ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల పరిధిలోని లక్కసాగరం, చిట్యాల గ్రామాల్లో విత్తన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటికే మండలంలో దాదాపు 400 మంది రైతులు విత్తనాల కోసం నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిన్నారుల్లో ఉత్తేజం నింపాలి

దేవనకొండ: గ్రంథాలయాలకు వచ్చే చిన్నారులను ఆటపాటలతో ఉత్తేజ పరచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ప్రకాష్ సూచించారు. స్థానిక లైబ్రరీని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ప్రకాష్ మాట్లాడుతూ.. 41 రోజులపాటు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చిన్నారులకు ఆటలు, పాటలు, కవిత్వాలు, కథలు, గేమ్స్, అండ్ స్పోర్ట్స్‌పై అవగాహన కల్పించేలా లైబ్రేరియన్లు చర్యలు తీసుకోవాలన్నారు. లైబ్రేరియన్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

దేవనకొండ: మండలంలోని దుప్పనగుర్తి గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన కురువ రామాంజనేయులు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలను శనివారం సచివాలయం ఉద్యోగుల సమక్షంలో కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబానికి వైఎస్సార్ బీమా ఆసరాగా ఉంటుందన్నారు. మిగతా సొమ్ము త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలోజమ అవుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుంకన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, కృష్ణ, రంగడు, లింగన్న తదితరులు ఉన్నారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన రైతులు వేరుశనగ విత్తనాల కోసం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నేటి నుంచి నమోదు చేసుకోవాలని ఏఓ హేమలత తెలిపారు. శనివారం ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కే6 వేరుశనగ విత్తనాలు 40 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు చెప్పారు. పొలం ఎవరి పేరు మీద ఉంటే వారే నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో విత్తనాల కోసం నమోదు చేసుకోవచ్చని, వేరుశనగ విత్తనకాయలు క్వింటం ధర రూ.9,300 కాగా సబ్సిడీ రూ.3,720 పోనూ రైతులు రూ.5,580 చెల్లించాలన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఎమ్మిగనూరుటౌన్: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని స్థానిక వైద్యాధికారిణి శారద సూచించారు. శనివారం స్థానిక రాఘవేంద్ర పట్టణ మహిళా సమాఖ్య, మెప్మా ఆధ్వర్యంలో మహిళల జీవితాల్లో రుతుక్రమం, సహజ ప్రక్రియపై అపోహల తొలగింపుపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వైద్యురాలితో పాటు సీఓ అరుణ యుక్తవయస్సు బాలికలు, మహిళలకు పలు సూచనలిచ్చారు. మెప్మా టీఎంసీ వెంకటేశ్వర్లు, వార్డు సచివాలయ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నీటి సమస్యను తీర్చండి

హొళగుంద: స్థానిక 5వ వార్డులో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు శనివారం అధికారులను కోరారు. నీటి సమస్యపై వార్డుకు చెందిన కొందరు స్పందనలో ఫిర్యాదు చేయడం పట్ల ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి వార్డుకు వెళ్లి విచారణ చేపట్టారు. గత కొద్దికాలంగా నీరు సక్రమంగా రావడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు అధికారుల ముందు వాపోయారు. స్పందించిన ఈఓపీఆర్డీ, సెక్రటరీ వెంటనే నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వాటర్ వర్కర్లను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండినీటి సరఫరా వేళల సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ఆలూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ కల్యాణి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వార్షిక తనిఖీ కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులు స్టాంప్ డ్యూటీ, ఫీజు వివరాలను పరిశీలించారు. ఆలూరు సబ్ రిజిస్ట్రార్ మురళీధర్‌రావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

శ్మశానానికి ప్రభుత్వ భూమినే కేటాయించాలి

గోనెగండ్ల: బి.అగ్రహారం గ్రామంలో శ్మశానానికి ప్రభుత్వ భూమినే కేటాయించాలని గ్రామస్తులు కోరారు. శనివారం బి.అగ్రహారం గ్రామంలో సర్పంచ్ రంగారెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డీపీఓ ఆదేశాల మేరకు గ్రామంలో నెలకొన్న శ్మశాన సమస్య పరిష్కారం కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో అన్ని కులాల వారికీ సరిపడే విధంగా శ్మశానం కోసం సర్వే నంబర్ 11/1లో 1.30 ఎకరాల భూమిని ఇచ్చేందుకు రామేశ్వరరెడ్డితో పాటు మరో వ్యక్తి ముందుకు వచ్చారు. అయితే స్థలం అనుకూలంగా లేదని వర్షం వస్తే రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని, ప్రైవేట్ వ్యక్తులు ఇచ్చే స్థలం తమకు వద్దని గ్రామస్తులు తేల్చి చెప్పారు. సర్వే నంబర్ 244లో ప్రభుత్వ భూమిని శ్మశానానికి కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ

ఆలూరు: ప్రభుత్వం విధి, విధానాలకు అనుగుణంగా ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ మండలస్థాయి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ రంగమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, వైస్ ఎంపీపీలు శ్రీరాములు, నాగవేణితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు హాజరయ్యారు. అనంతరం గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, తాగునీటి సదుపాయం, జగనన్న కాలనీలలో గృహాల వేగవంతం, వృద్ధాప్య పింఛన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు, మన బడి నాడు-నేడు పనులపై అధికారులతో సమీక్షించారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈనెల 29న స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కమిటీ చైర్మన్‌గా తన ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరావాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించారు. వివిధ ప్రభుత్వ శాఖల మండలాధికారులు డాక్టర్ మారుతి, విద్యుత్ ఏఈ లోకేష్, పీఆర్ ఏఈ చౌడారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఓ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్‌ను అరికెర ఎంపీటీసీ సభ్యుడు షేక్షావలి ఘనంగా సన్మానించారు.

లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలి



రాంపల్లి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీర్రాజు

తుగ్గలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీర్రాజు సూచించారు. ఆయన శనివారం రాంపల్లి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సొంతింటి కలను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు సహాయం అందిస్తోందన్నారు. దీనికి తోడు పొదుపు మహిళలకు రూ.30 వేలకు పైగా రుణం సమకూరుస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అంతకుముందు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ వీర్రాజు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సచివాలయ కన్వీనర్ నాగభూషణం రెడ్డి, హౌసింగ్ ఏఈ విజయకుమార్, ఏపీఎం రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశం నుంచి బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

హొళగుంద: అధ్వానంగా ఉన్న ధణాపురం-హొళగుంద రోడ్డు మరమ్మతుల విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని వెంటనే పనులు ప్రారంభించకపోతే నిరవధిక ఆందోళనకు దిగుతామని ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుండగా ఆర్అండ్‌బీ అధికారుల గైర్హాజరుపై ఇంగళదహాళ్ ఎంపీటీసీ మల్లికార్జున ఎంపీడీఓ దాసానాయక్‌ను ప్రశ్నించారు. సీఎం సభ ఏర్పాట్లు చూసుకునేందుకు పత్తికొండకు వెళ్లారని చెప్పడంతో ఆయనతో పాటు ఇతర ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ నుంచి బయటకొచ్చి ధణాపురం రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిపివేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. దీనిపై 30న పత్తికొండకు రానున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు చెప్పినట్లు ఎంపీడీఓ ప్రజాప్రతినిధులకు తెలిపారు. దీంతో సభ తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా సభలో అనేక సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. కోగిలతోట, ఎల్లార్తి తదితర గ్రామాలలో ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు ప్రమాదకరంగా ఉన్నాయని ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ దృష్టికికి తెచ్చారు. గజ్జహళ్లి పీహెచ్‌సీలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని కెంచప్ప ఆరోపించారు. గ్రామాలకు సరఫరా చేసే తాగునీరు కలుషితం అవుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ దృష్టికి తెచ్చారు. అలాగే వ్యవసాయం, పశువైద్యం, వైద్యం, విద్య, పీఆర్, ఉపాధి హామీ పథకం తదితర శాఖల అధికారులు సమావేశంలో మాట్లాడారు. జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, ఎంపీడీఓ దాసానాయక్, డీటీ దీప, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముత్తులక్ష్మి సేవలు ఆదర్శనీయం



జ్యోతి అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు ముత్తులక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం నియోజకవర్గంలోని తుంగభద్ర గ్రామంలో అనాథ ఆశ్రమం నిర్వహిస్తూ సేవలందిస్తున్న ముత్తులక్ష్మి నేటి తరానికి ఆదర్శనీయులని మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, బీసీ సంఘం జాతీయ నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అజంతా ఫంక్షన్ హాల్‌లో స్థానిక పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జ్యోతి అనాథ ఆశ్రమం నిర్వాహకురాలు ముత్తులక్ష్మిని ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ.. 1981లో ఆశ్రమం ప్రారంభించిన ఆమె వందలాది మంది అనాథలను చేరదీసి అన్ని తానై పెంచి పోషించి, పెళ్లిళ్లు చేసి వారి భవిష్యత్‌కు మార్గం చూపారని కొనియాడారు. ఆమె జీవితాన్ని సేవా మార్గంలో కొనసాగించడం ఆదర్శనీయమన్నారు. బీసీ సంఘ నాయకులు గణేష్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు, పూలే ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు ప్రతిభ భారతి, నరసన్న, మనోహర్, మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2న జాబ్‌మేళా



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 2వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా జాబ్‌మేళా పోస్టర్లను అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కంటి వెలుగు' పేదలకు వరం



పత్తికొండలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

పత్తికొండ రూరల్: వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదలకు వరం అని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. శనివారం స్థానిక సచివాలయం-3లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పుచ్చకాయలమాడ పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

కృష్ణగిరి: గ్రామాల్లో ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్ల, ఆలంకొండ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. గ్రామాల్లో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, ఇలాంటి వాటిని వ్యతిరేకించాలన్నారు. అలాగే రహదారి సూచనలు పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పక వాడాలని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు.